కథా నిలయం
4588
శ్రీకాకుళం

# బస్సులో 10 నిమిషాలు

ఆఫీసుకు వెళ్లాలని బస్సుస్టాండుకుచేరి నుంచున్నాను. శీతకాలం ప్రొద్దున తొమ్మిది గంటలు. సూర్యుడు రెపరెప లాడుతూ ఆకాశవలయంలో అంతస్థులు ఎక్కుతున్నా రివ్వున వీచే శీతగాలి చలిమాత్రం కరుస్తోనే వుంది.

స్టాండుకు రెండడుగుల దూరంలో ఒక చింతచెట్టు, ఎదురుగా రెండు గుడిసెలు, వాటి వెనకాల పచ్చటి పొలాలు వున్నాయి. బస్సుస్టాండుకు వెనకాల ఒక ఫ్యాక్టరీ, దాని తాలూకు ఉద్యోగస్తుల యిళ్లు, ఆ యిళ్లను ఆవరిస్తూ మొక్కల తుప్పలు, ఆ తుప్పలమధ్య పగిలివున్న కల్లుకుండలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. జాగ్రత్తగా పరిశీలిస్తే ఆ ప్రదేశం గ్రామ నగరాల వాతావరణాలు రెండూ మిళితం చేసుకున్నట్లు కనిపిస్తుంది.

నేను పుట్టింది పల్లెటూరు. మసలుతున్నది మహానగరం, ఈ రెంటి వాతావరణాల సంఘర్షణ నాలోనూ వుంది. స్వరూపాలు వేరైనా ఆ ప్రకృతికి, నాకూ సన్నిహితత్వం కనిపించింది.

ఆ ప్రక్కనేవున్న మేకల దుకాణం నుంచి మాంసం గంపల్లో పోతోంది. కనుచీకటి పడగానే కల్లుత్రాగి కళ్లు మూసుకుని, విశ్రమించిన కార్మికులు, నిన్న మరచిపోయి నేటి దినచర్యకు వుపక్రమిస్తున్నారు. ఉద్యోగస్తులు ఇస్త్రీ మడతలతో భోజనంచేసిన బరువైన శరీరాలతో తాంబూలాలు

నములుతూ, ఒగరుస్తూ, గబగబా సైకిళ్ల మీద పోతున్నారు. ఒక నల్లటి పంతులమ్మ, యిద్దరు స్కూలు కుర్రాళ్లు నా ప్రక్కనే వచ్చి నిలిచారు బస్సుకోసం, కాలం ప్రపంచాన్ని రాసుకు పరుగిడుతోంది. ఆ రాపిడిలో చుట్టూ ఎంతో మార్పు కనిపిస్తోంది.

చెట్ల కొమ్మలచాటులో దూరాన్నుంచి ఒక బస్సు ఎండ వెలుగులో తళుక్కున మెరిసింది. మరుక్షణంలో, రాథారిపడవ నీళ్లను చీల్చుకొని మెల్లగా నడుస్తున్నట్లు, ఆ బస్సుకూడా బరువుగా, మెల్లగా, ఒక లావుపాటివాని పరుగులా, రోడ్డును దూసుకుంటూ నా దగ్గరకు వచ్చి ఆగింది.

నేను బస్సు ఎక్కాను. నా వెనకాలే పంతులమ్మ, స్కూలు కుర్రాళ్లు కూడా ఎక్కారు. కానీ, కూర్చోడానికి స్థలం లేదు.

బస్సులో ఒకవైపు కాలేజీ అమ్మాయిలు రంగురంగు చీరెలతో నలిగిపోని యిస్త్రీ మడతలతో నాజూకుగా కూర్చు న్నారు. పుస్తకాల దొంతరలు చేత్తో పట్టుకుని, ఇంద్ర ధనుస్సులా పంగనామం పెట్టుకున్న ఒక ఆచారి మాస్టారు ఆనాడు తను చెప్పవలసిన పాఠాలు నిమీలిత దృష్టితో మౌనంగా వల్లెవేసుకుంటున్నారు. గత జీవిత స్మృతులు స్మరించు కుంటూ మూలగా ఒక వితంతువు తనలో నవ్వుకుంటోంది. నేను ఒకప్పుడు పెళ్లిచూపులకు వెళ్లిన ఒక పెళ్లికాని అమ్మాయి నాకేసి కొరకొర చూస్తోంది. ఒక పల్లెటూరి యాదయ్యా తన గొంగళీతో యితరులపై యిష్టమొచ్చినట్లు బరుకుతూ, చేతిలోని పొడుగాటి కర్రతో ప్రక్కవాళ్లను పొడుస్తున్నాడు.

ఇటు సంసారానికీ, అటు హోదాకూ, సరిపోని జీవితంతో కాలక్షేపం చేస్తున్న ఒక ఆఫీసరు తాను ఎప్పుడు కారు కొనగలనా, ఎప్పుడు యీ బస్సు బెడద తప్పునా అని విచారిస్తున్నాడు. ఒక పెద్దమనిషి ఆనాటి వార్తలు పత్రికలోనుంచి కళ్లల్లోకి పీల్చుకుంటున్నాడు కంగారుగా. ఇటు ఉద్యోగం, అటు సంసారం యీదుకోడం కష్టమైపోతున్న ఒక నలభై యేండ్ల లావుపాటి గర్భిణీ పంతులమ్మ, విశ్రాంతిలేక, కళ్లక్రింద నల్లటి జీరలతో, శ్రమ దేవతలా వుంది.

ఒక యువకుడు హుందాగా లేచి నిలబడ్డాడు.

"మీరు కూర్చోండి" అంటూ నల్లటి పంతులమ్మవైపు తిరిగాడు ఔదార్యంతో. ఆమె నల్లదనం అతనికి ఫరవాలేదనిపించింది.

పంతులమ్మ మాట్లాడలేదు. పైగా ఆ ఖాళీచేసిన సీటులో కూర్చోనూలేదు. పొట్టకోసం నాగరికంగా ఉద్యోగంచేస్తున్నా, ఆమెలో స్త్రీ సహజమైన బిడియం, మగవాళ్లంటే భయం పోలేదనిపించింది.

సీటు ఖాళీచేసిన యువకుని ప్రక్కనే కూర్చున్న పల్లెటూరి యాదయ్య "యేందమ్మోయి" అంటూ గావుకేక పెట్టాడు. ఆ నల్ల పంతులమ్మకేసి అదేగా చూస్తున్న ఆ యువకుడు కూడా ఉలిక్కిపడ్డాడు. పాపం! యాదయ్యా నల్లకాలు ఆ యువకుని నాడాలబూటు క్రింద పడి, నలిగి, కొంచెం ఎరుపు రంగు దాల్చింది. ఆ అమాయకుడు బాధగా, కోపంతో ఆ యువతివైపు చూశాడు. ఆ యాదయ్యా గావుకేకకు బస్సులోని

జనం గొల్లుమని నవ్వారు. కాలేజీ అమ్మాయిలు కిలకిలమంటూ జేబురుమాళ్లలో తమ నవ్వులు దాచుకున్నారు.

ఆ పంతులమ్మ ఆ యువకుని మధ్య మామూలు బస్సు పరిచయమే కాక, బ్రతుకుల పరిచయం కూడా వున్నట్టుంది. లేకపోతే ఆ యువకుడు అంత దీనంగానూ, ఆ పంతులమ్మ అంత చిరాకుగానూ చూడవలసిన అవసరం లేదు.

మీాషురాబాద్ !

ఒక సేటు హడావుడిగా దిగిపోయాడు.

నేను కూర్చున్నా.

నా ప్రక్కనే కూర్చున్న ఒక పెద్దమనిషి నాకేసి తదేక ధ్యానంతో చూస్తున్నాడు. నాకు భయం వేసింది.

ఒక ఖద్దరు లాల్చీ, ఒక చేనేత పంచ, జలతారు కండువా, కళ్లజోడూ, నెరిసిన చిన్న వెంట్రుకలు, పరిచిన బట్టతల, పరపతి గడించుకున్న పెద్దమనిషిలా కనిపించాడు.

“మీా పేరేమిటండీ!” గట్టిగా మాట్లాడాడు.

ఆ ధోరణి చూడగా ఆయనకు చెముడున్నట్లు తెలుస్తోంది.

ఆ బస్సులోని జనమంతా నాకేసి చూశారు.

ఆయన ఆ ప్రశ్న మళ్లీ రెట్టించాడు.

కోర్టులో బలవంతాన తప్పుడు సాక్ష్యమివ్వవలసినంత బాధపడ్డాను.

తప్పనిసరిగా మర్యాదకు మాట్లాడాను.

“తమరిని ఎప్పుడూ నే చూడలేదు.”

నా మాట వినిపించుకోలేదు ఆయన.

"మీరు చింతావారి అబ్బాయికదూ! మీ ఫోటో చూశాను. మీ రిక్కడే వుంటున్నారని మొన్న మా తోడల్లుడు చెప్పాడు. ఇంకా మీకు పెండ్లి కాలేదటగా!"

ఇటువంటి ప్రసక్తి పదిమంది కూర్చున్న బస్సులో వస్తుందంటే, ఆయన ప్రక్కన నేను కూర్చోకుండా వుండే వాడిని. ఇటు కూర్చోలేక, అటు సమాధానం చెప్పలేక, లేచి నుంచుని మరో చోటికి పోలేక చాలా తికమకలో పడ్డాను.

"ఊ! ఇప్పుడు ఎక్కడ పనిచేస్తున్నారూ?" "ఏమిస్తా రేమిటి?" ఆయనలో ఆయన ఒక్క నవ్వు నవ్వుకున్నాడు. "చిన్నప్పుడు ఒకసారి నిన్ను చూశాను. అప్పుడు బక్క పలుచగా, సన్నంగా వుండేవాడవు. ఇప్పుడు మంచి పుష్టిగా, అందంగా తయారయ్యావే!" మళ్లీ నవ్వుకున్నాడు ఆయన.

ఈ సంభాషణ భరించలేకపోయాను,

ఆయన మాటలు యింక ఏదోవిధంగా ఆపాలను కున్నాను.

"నేను చింతావారి అబ్బాయిని కాదండీ!"

అబద్ధ మాడాను. నన్నెరిగిన కొంతమంది నవ్వారు. నన్నెరగని ఆ బస్సులోని జనం ఆ సంభాషణ విని మరీ నవ్వారు.

ఆ పెద్దమనిషి నా భుజం తట్టాడు అప్యాయంగా.

నా మాట విన్నట్లు లేదు.

"నీ గోత్రం?" నాకేసి ఆత్మతతో చూశాడు.

రహత్ మహల్! కండక్టర్ అన్నాడు.

"అరెరె! దిగిపోతావేం?" అంటూ కంగారుగా లేచాడు ఆయన, కండక్టరు కేక వినకుండానే.

"హమ్మయ్య బ్రతికా"నని సంతోషించాను! "మళ్లీ నిన్ను కలుసుకుంటానోయ్! నువ్వు ఎక్కడ వుంటున్నావు?"

"ప్రాగా టూల్స్ ఫ్యాక్టరీవద్ద!" ఈసారి గట్టిగానే అన్నాను ఆయనకు వినిపించాలని. ఆ మాట వినిపించకపోతే నా సమాధానంకోసం, నన్ను పీడిస్తూ ఆయన అలాగే నిల్చుని ఆ బస్సు ఆపేయగలడనిపించింది.

"ఉహు! మంచిది. మా బావమరది యీ ప్రక్కనే వుంటున్నాడు. వాళ్లయింటికి వెడుతున్నా!" అంటూ దిగిపోయాడు.

ఆ సంభాషణలో చెరుకుపిప్పిలాగ మిగిలిపోయిన నాకు, వేసవిలో చెరుకు పానకం తాగినంత హాయి కలిగింది ఆయన వెళ్లిపోవడంతో.

ఒక అమ్మాయి నా పరిస్థితి చూసి తెగ నవ్వుతోంది.

ఆమె నన్నెరుగును. నేను ఆమె నెరుగుదును. కాని యిద్దరం ఎప్పుడూ మాట్లాడుకోలేదు. కారణం, ఎప్పుడూ ఆ బస్సులోనే కలుసుకోడం, విడిపోవడం జరుగుతోంది. బాహ్యంగా సృష్టించుకున్న సంబంధాలకన్న, మనిషి మనస్సులోని సంబంధాలు ఎన్నో లోలోపలనే అణిగిపోతున్నాయనిపించింది.

రహత్ మహల్‌లో జయసింహ సినిమా నడుస్తోంది. పిన్న వయసులోని రాజకుమారుణ్ణి, పెద్దమనిషిలాంటి అతని తండ్రి సోదరుడు, మోసంచేసి, సింహాసనం సంపాదిద్దా మనుకున్నాడు. పిన్న వయసు రాజకుమారుడు పెంచుకున్న మమతలు ద్వారానే తిరిగి రాజ్యం సంపాదించుకున్నాడు.

మమతల మాధుర్యం మనుష్యుల బ్రతుకే మార్చేస్తుంది. అది సృష్టించుకుంటే రాదు. సహజంగా జన్మించాలి. ఒక తల్లి ఒడిలోని పిల్లవాడు జయసింహ బొమ్మను వేలుపెట్టి చూపిస్తూ హాయిగా నవ్వాడు.

మళ్లీ జనం ఎక్కారు. బస్సు చాలా రద్దీగా వుంది.

కాలేజీ అమ్మాయిలలో కలకలం బయలుదేరింది. టిక్కెట్టు కొనుక్కుంటూంటే, ఒక అమ్మాయి పర్సులోనుంచి ఒక అర్ధరూపాయ జారి, గుండ్రంగా నడిచి, మగవాళ్ల పాదాల క్రింద బూట్ల అడుగున ఎక్కడో దాక్కుంది. ప్రతివాడు తన బూట్ల క్రిందనే వెదికాడు. ఆ అమ్మాయికి సాయంచేసి, తను సంతోషించి ఆమెను సంతోషింపచేద్దామని. ఆ అర్ధరూపాయ ఏ సందట్లో పడిందో ఎక్కడ దాక్కుందో కాని కనిపించలేదు. తనకు విడాకులిచ్చిన ఆ అర్ధరూపాయను గురించి ఏమీ ఆలోచించడం యిష్టంలేక వూరుకుంది ఆ అమ్మాయి. టిక్కెటు యిచ్చేసిన కండక్టరు కళ్లు లోపల ఆనందంతో మెరిశాయి. ఎలాగయినా బస్సుకూ, అతనికీ వున్న సన్నిహిత సంబంధం ఎవరు కాదన గలరు?

ఒక ఆడమనిషి కోళ్లగంపతో బస్సులోకి వచ్చింది. వెనకాలే ఒక నల్లచారల కోటు, తలపాగా ఉన్న ఒక పొట్టి నాయుడు, ఒక నల్గురు ఆడవాళ్ళు ఎక్కారు.

గంపలో కోళ్ళు ఖువు ఖువు మంటున్నాయి.

జనమంతా కోళ్ళ గంప చూసి నవ్వుకున్నారు.

"ఏయ్! యీ కోళ్ళగంప తెచ్చావేమిటి?" కండక్టరు అరిచాడు.

"నీకు దణ్ణం దొరా! శానదూరం పోవాలి. పైసలు తీసుకో!" ఆ అమ్మిని చూసి కండక్టరు నవ్వాడు. సంతృప్తితో నవ్వుకున్నాడు. పొట్టినాయుడు కూడా టిక్కట్టు కొన్నాడు.

అతని వెనకాల వచ్చిన ఒక పాతికేళ్ళ వయ్యారి "ఏంది మావయ్యోయి! ఎన్ని టిక్కట్లు కొంటివి?" అంటూ నాయుడుకేసి చూసింది.

"ఓటేనే!" కులుకుతూ నవ్వాడు నాయుడు.

"ఓరి నీయిల్లు బంగారంగాను! ఇంతడబ్బు గడిస్తివి! మమ్మ వదిలి ఓటే కొంటివా? అట్లైతే నేనే కొందుగా నీకు టిక్కట్టు!"

ఆమె పెద్దకళ్లు గుండ్రంగా వయ్యారంగా తిరిగాయి. ఆమె నున్నని బుగ్గలు చిరుకోపంతో సొట్టపడ్డాయి. నాయుడు బావ, వెంకి—జ్ఞాపకం వచ్చారు. కానీ ఒక్కటే తేడా, ఆమె వెంకిలాగే వుంది. అతను మాత్రం 'మావయ్య' అయిపోయి ప్రేమమీదకన్న ధనంమీద ఎక్కువ మోజు కుదుర్చుకున్నాడు.

ఆ వయ్యారి మాటలకు బస్సులోని జనమంతా కులుకుతూ నవ్వులు లోలోపలే మ్రింగుకున్నారు.

'ఏటోయ్ సీ! మాసోగ్గా మాటాడుతున్నావు?' అంటూ నాయుడు నవ్వాడు.

బస్సు బర్రుమంటూ వేగంగా నడుస్తోంది.

చార్ మినార్ చౌరాస్తా!

చాలామంది ఉద్యోగస్తులు బస్సు దిగారు. బస్సు చాలా ఖాళీ అయింది. ఒకరిద్దరు చిన్న అమ్మాయిలు, యం. బి. బి. యస్. చదువుతున్న ఒక ఆచార్యుల అమ్మాయి బస్సులోకి ఎక్కారు.

కండక్టరు నా పక్కన కూర్చున్న మనిషిని అడిగాడు; "టిక్కట్టు కొన్నారా?"

ఆ పెద్దమనిషి పరాగ్గా బస్సు కిటికీలోంచి బయటికి చూస్తూ, కండక్టరు ప్రశ్నకు గబుక్కున వెనుదిరిగి జేబులో చెయ్యి దూర్చాడు. ఒక నిమిషం జేబంతా తడిమి, ఒక అణా బయటికి తీశాడు.

'ఎక్కడికి?' కండక్టరు అన్నాడు.

'కోటీకి!' అంటూ అణా చేత్తో పట్టుకుని కండక్టరు వైపు దీనంగా చూశాడు అతను. నలిగి పోయిన కోటు — దారాలు ఊడుతున్న పంట్లాం-ఒక సంవత్సరంనుంచి పాలిష్ లేక అట్టగట్టి అడుగు ఊడిపోతున్న బూటు—అత నొక బీద గుమాస్తాలా కనిపించాడు.

'పొరపాటయింది. జేబులో ఒక అణాయే ఉంది' నసిగాడు అతను.

'మూడణాలు యివ్వాలి!' కండక్టరు తీవ్రంగా చూశాడు! అతను తన్ను అవమానపరిచే బస్సులోని జనం వైపుచూసి తలదించుకున్నాడు.

'లేకపోతే దిగిపొండి యిక్కడ' నిష్కర్షగా చెప్పాడు కండక్టరు.

కండక్టరు ప్రవర్తన నాకు బాగులేదనిపించింది. ఏ కారణం వల్లనో పొరపాటున డబ్బు తేవడం మర్చిపోయి ఉండవచ్చు అతను అనుకొన్నా.

'పై రెండణాలు నేనిస్తా, తీసుకోండి!' అంటూ అతనికి ఆయాచితంగా దానం చేశాను.

'మీరా...నమస్కారమండి...మళ్ళీ మీకు రేపిచ్చేస్తా!' అతను కంగారుగా మాట్లాడాడు.

"ఫరవాలేదు లెండి!" నవ్వాను.

అతను టిక్కట్టు తీసుకొన్నాడు.

'ప్రొద్దున్నే ఆసుపత్రి కెళ్ళానండి. మా ఆవిడకు ఆరవ కాన్పు. ఆరిపోయే దీపంలా ఉంది. ఆ విచారంలో అన్నీ మర్చిపోయేను. అందుకే యీ అవమానం యీవేళ!' క్లుప్తంగా తన స్థితి నాకు వినిపించేలా ఊదాడు నా చెవిలో అతను.

'పాపం!' నాకు తోచిన సానుభూతి చూపించాను. అతను మళ్ళీ పరాగ్గా బస్సు కిటికీలోంచి బయటికి చూశాడు. నేనూ అతనివైపు చూశాను. అ బస్సు కిటికీలోంచి ఎండ వచ్చి అతని ముఖంమీద వాలింది. ఆ ఎండలో అతని పెదాలు బిగుతుగా నవ్వాయి. అతనికి మతి భ్రమింస్తోంది?... కాదు

అతన్ని అర్థం చేసుకోలేక రెండణాలిచ్చిన నాకే మతి భ్రమించింది అనుకున్నాను.

అనుభూతి మార్పుకై మళ్ళీ బస్సులోకి చూశాను. ఆడపిల్లల చోటుల్లో స్థలంలేక ఆచార్యుల అమ్మాయి నుంచుంది. చాలా అందంగా ఉంది. బంగారు రంగులో కోలముఖం- తెల్ల సిల్కు- చీర-నల్ల జాకెట్టు - ఎత్తు మడమల స్లిప్పరు - చేతిలో స్టెతోస్కోపు ! ఎంత అందంగా ఉందో అంత చిరాగ్గా, విచారంగా, బాధకరంగా ఉంది ఆమె ముఖం. అల్లా ఉండడం ఆమె అలవాటు కాబోలు! మునుపు చాలాసార్లు కూడా ఆమె అలాగే కనిపించింది. ఎంతో మార్ధవం తొణికిసలాడే ఆ యావన స్త్రీలో మందహాసంపోయి నిరాశ, నిస్పృహల్లో జీవిస్తున్నట్లు ముఖం పెట్టడం హాయిగా వుండే వయస్సులోని వాళ్ళందరికీ అవమానమే! అయితేనేం ఆమె తత్వం మారేలా లేదు ! !

వార్తాపత్రిక నమిలేస్తున్న మనిషి పత్రిక మడచి కళ్ళజోడు కొంచెం సరిచేసుకొని, బస్సులోని జనంవైపు కలయచూసి, ఒక పెద్ద నిట్టూర్పు విడిచాడు. అప్పుడే మూడవ ప్రపంచ మహాసమరం రేగి, ప్రళయం వచ్చి, అంతా మాయమయి, తిరిగి నూత్న సృష్టి ఎదురుగా కనిపించినంత సంతృప్తి కనబరుస్తూ, పెదాలు బిగించి, మరొక పెద్ద నిట్టూర్పు విడిచాడు. అతని ప్రక్కనే కూర్చున్న మరొకాయన వారపత్రిక చూడాలనే కుతూహలంతో సతమతమాతూ, పత్రిక మడవగానే బలవంతాన లాక్కున్నాడు. పరధ్యానంగా మొదట పత్రికిచ్చే

సినా తర్వాత జ్ఞప్తికి వచ్చి, ఆ పత్రిక యజమాని కోపంగా ఒక్కసారి సకిలించుకున్నాడు. ప్రక్కనాయన మాత్రం పత్రిక చదవడం మానలేదు. వీలైతే మరో ప్రక్కవాడికి కూడా అందించేలా ఉన్నాడు.

చిక్కడపల్లి!

ఇరవై ఏళ్ళక్రితం అరణ్యంలో ఉండిన ఆ ప్రదేశం చిన్న పట్నంలా తయారయింది. జనంతో డాబాలతో కలకల్లాడుతోంది. బస్సు దాటిపోతుందని యిద్దరు ఉద్యోగస్తులు పరుగెత్తుకుంటూ వచ్చి బస్సు ఎక్కారు. బస్సు మళ్ళా జనంతో కిటకిట లాడింది. ఎదురుగా కూర్చున్న వారినిగాని, ప్రక్కగా కూర్చున్న కాలేజీ అమ్మాయిలను గాని చూడనీకుండా అడ్డుగా ఉన్నారు నుంచున్న బస్సు ప్రయాణీకులు.

బస్సు ఒక కాలవరోడ్డు మీదకు వచ్చి దుమ్ము రేగ కొడుతూ పరుగిడుతోంది. కాలవలో నీళ్ళు కొద్దిగానే ఉన్నాయి. నీరులేని ప్రదేశంలో చెల్లు, తుప్పలు పెరిగాయి. నాలు గయిదుచోట్ల యీ చెట్లుకూడా ఉన్నాయి. చాకలాళ్లు బట్టలుతుకుతున్నారు. నీళ్ళు రాళ్ళమీదినుంచి జారుతూ మందకొడి బ్రతుకులా మెల్లగా కదులుతున్నాయి.

కాలవ వంతెనమీద బస్సు గబుక్కున ఆగింది. ఎదురుగా రెండెడ్ల బండి వంతెనకు అడ్డుగా నుంచుని ఎడ్లు బెదిరి బండిని అడ్డంగా తిప్పాయి. బస్సులోని జనమంతా చోద్యంగా బయటికి చూశారు. కండక్టరు దిగి బండి పోవడానికి సాయంచేసి తిరిగి వచ్చాడు. బస్సు కదిలింది. మళుపు తిరిగింది.

బరకత్‌పురా!

ఎదురుగా ఒక ముస్లిం యిల్లు కనిపించింది. రెండున్నర సంవత్సరాల క్రితం జనం యిక్కడ ఒకసారి చాలా గుమిగూడారు. అక్కడి వింతలు వార్తాపత్రికలు కూడా ప్రచురించాయి. ఒక అందమైన అమ్మాయికి ఎవరో చేతబడి చేశారు. ఆమె ఒక పిచ్చిదిలా మారిపోయి బాధపడింది. పెద్ద పెద్ద రాళ్ళు పట్టపగలే యింటిమీద పడుతున్నట్లు అందరికీ హడలు కొట్టేంత పని జరిగేది ఆ యింట్లో. ఇంతకూ ఆ అమ్మాయిని కావాలనుకున్న కుర్రాడికిచ్చి పెండ్లి జరుపలేదని ఆ చేతబడి జరిగిందట. అది గతించిన విషయమైనా, ఆ సంగతి ఎరిగిన ప్రతి వానికీ ఆ దారిన వెడుతూంటే జ్ఞాపకం వస్తూనే వుంటుంది. ముఖ్యంగా పెళ్ళికాని అమ్మాయిలకూ, అబ్బాయిలకూ!

బస్సు జర్రున ప్రాకింది.

నారాయణగుడ!!

నేను బస్సు దిగిపోయాను.

నారాయణగుడ రాస్తాకు వచ్చాను.

చేతిలో ఉన్న ఉత్తరాలు ప్రక్కనే ఉన్న తపాలా పెట్టెలో వేశాను, అందుకోబోయే స్నేహితులను తల్చుకుంటూ.

పెళ్ళయిన నాయుడు మావయ్య సరసం, అబద్ధమాడిన గుమాస్తా బీదరికం, నల్లపంతులమ్మకు చోటిచ్చిన యువకుడి ప్రేమ, నా పెళ్ళికి తొందరచేసిన ఆడపిల్లలు గల తండ్రిస్వార్థం, అందమైన ఆచార్యుల అమ్మాయి వదనంలోని విచార రేఖలు,

జీవితం మార్పులో నాలో నుసి అయిపోతున్న ఎన్నో అనుభూతులు, మళ్ళీ నెమరు వేసుకున్నా! వాటికి మూలం ఎక్కడనో దాక్కున్న ఒక్క హృదయానుబంధం!!

రిక్షాకోసం ఎదురు చూశాను.

దూరాన్నుంచి నన్ను చూసి రిక్షావాడు గబగబా తన సైకిలు తొక్కుతూ నా ముందు వాలాడు. వాడి నీరస జీవితానికి కావలసిన డబ్బు ముందు నా దగ్గర ఎక్కువ దొరుకు తుందని వాడికి నేనంటే ఎంతో అభిమానం.

రిక్షాలో కూర్చున్నా!

నా ఎదురుగా ఎత్తుగా గాంధీబొమ్మ ఒకటి నుంచుంది. ఆకృతి సరిగా రాక వికృతంగా కనిపిస్తోంది. విగ్రహానికి సరైన విలువ యివ్వలేని తప్పు శిల్పిది. అంతమాత్రాన ఆ విగ్రహం విలువ పోలేదు. అందుకే చాలాకాలంనుంచి ఆ విగ్రహం అక్కడే వుంది.

ఆంతరంగికమైన విలువలు అర్థం కాకపోయినా బాహ్యమైన కృత్రిమ విలువలతో బ్రతుకులు కదిలి పోతున్నాయి. ఇంతే ప్రపంచం అంతా. ఆ బస్సులో ఒక చిన్న ప్రపంచం కనిపిస్తుంది! రోజుకొక క్రొత్త ప్రపంచం!!!

---